
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి



కామారెడ్డి
జిల్లా వార్తలు

5

సోమవారం 15 సెప్టెంబరు 2025



తెలుగు తోరణ వర్ణమాల ప్రదర్శించిన విద్యార్థులు

తెలుగు భాషను గౌరవించాలి

• పద్య కవి డాక్టర్ వెంకట్

మద్నూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలుగుభాషను ప్రేమించాలని, గౌరవించాలని ప్రముఖ పద్య కవి, కవియాత్ర జాతీయ ప్రధాన కార్యదర్శి డా.బి.వెంకట్ అన్నారు. మద్నూరు తెలంగాణ గురుకుల బాలుర విద్యాలయం, జూనియర్ కళాశాలలో తెలుగు వెలుగు అనే ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో జానపదాలతో కూడిన అనేక పదజాలాలు ఏర్పడ్డాయని అన్నారు. తెలంగాణ తెలుగు యాసతో బాసతో మంచి ఆత్మీయ పలకరింపులతో ఉంటుందని పోతన భాగవతము భక్తి మాధుర్యమును పంచుతుందని, దాశరథి కృష్ణామాచార్యుల రచనలు జనులను చైతన్యవంతం చేస్తాయని, డా.సి. నారాయణరెడ్డి రచనలు సామాజికత్వమునకు ప్రతిబింబిస్తాయని గుర్తు చేశారు.

అలరించిన తెలుగు తోరణం

విద్యార్థులు స్వయంగా తయారు చేసిన తెలుగువర్ణమాల తోరణము అలరించింది. రుద్రమదేవి ఏకపాత్రాభినయం, హాస్య నాటికలు, తెలుగు పాటలు రంజింప జేశాయి. జీరో నుంచి ఇంటర్ వరకు విద్యార్థులు చార్టుల్లో వివిధ రకాలైన తెలుగు సాహిత్యం, వ్యాకరణం, కవుల జీవనశైలి, కావ్యాలు శాస్త్రాలు తదితర వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ యస్. గంగాకిశోర్, ఉపాధ్యాయులు రాము, ప్రవీణ్ కుమార్, ఏశైలజ, సుమన్, నరహరి, గణేశ్, వేణుగోపాల్, దత్తు, సంజు, గంగాప్రసాద్, తెలుగు భారతి, గురుకుల భారతి, క్రీడా భారతి, సంస్కృత భారతీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



షబ్బీర్‌అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

షబ్బీర్‌అలీని కలిసిన మాజీ సీడీసీ చైర్మన్

దోమకొండ(బీబీపేట) సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో దోమకొండకు చెందిన మాజీ సీడీసీ చైర్మన్ ఐరేని నర్సయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా షబ్బీర్‌అలీ మాట్లాడుతూ యూరియా, కామారెడ్డిలో త్వరలో నిర్వహించే బీసీ డిక్లరేషన్ సభ, స్థానిక సంస్థల ఎన్నికలపై చర్చించడం జరిగిందని నర్సయ్య తెలిపారు. బీబీపేట ఎస్సై ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు సుతారి రమేష్‌లకు ఫోన్‌లో యూరియాపై షబ్బీర్‌అలీ మాట్లాడారన్నారు. దోమకొండ, బీబీపేట మండలాల్లో రైతులకు అవసరమైనంత యూరియాను తెప్పించడం జరుగుతుందని రైతులకు ఇబ్బందులు కలుగకుండా యూరియాను పంపిణీ చేసేలా చూడాలని సూచించడం జరిగిందన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర నాయకులు ఇలియాస్ ఉన్నారు.

జీపీవోలు వచ్చారు.. వార్డు ఆఫీసర్లు వెళ్లారు

- వివిధ శాఖల్లో మళ్లీ ఖాళీలు 8
- ఎల్లారెడ్డి మండలానికి 24 మంది గ్రామ పాలన అధికారుల రాక
- ఆరుగురు వార్డు అధికారులు వెళ్లారు

బీబీపేట పోలీస్‌స్టేషన్ వద్ద టోకెన్ల కోసం క్యూలైన్‌లో ఉన్న రైతులు



ఎరువులు.. ఎటుపోతున్నాయ్?

- యూరియా నిల్వల తేడాలో 8 ఫర్టిలైజర్ దుకాణాలపై కేసులు
- పలుచోట్ల గోదాంలలో స్టాక్ ఉన్నట్లు రైతుల ఆరోపణలు
- యూరియా కోసం సొసైటీల వద్ద తెల్లవారు జాము నుంచే క్యూలో చెప్పులు, పాస్ బుక్కులతో రైతుల బారులు
- రైతులను అదుపు చేయలేక పోలీసులు
- 49 వేల మెట్రిక్ టన్నులకు 45 వేల మెట్రిక్ టన్నుల సరఫరా

యూరియా కోసం రైతుల ఆందోళన

కామారెడ్డి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తీరడం లేదు. ఓ వైపు డిమాండ్‌కు తగ్గ ప్రభుత్వం నుంచి యూరియా సరఫరా అవుతున్నా.. వచ్చిన యూరియాను వచ్చినట్టే రైతులకు సరఫరా చేస్తున్నామని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే వచ్చిన యూరియా అంతా ఎటుపోతుందని రైతు సంఘాలు, రైతుల మెదళ్లలో మెదులుతున్న ప్రశ్న. ప్రతీరోజు ఏ మండలంలో ఏ గ్రామంలో సొసైటీల వద్ద చూసినా రైతులు చెప్పులు, పట్టా పాసు పుస్తకాలతో క్యూలైన్‌లో ఉంటూ గంటల తరబడి నిరీక్షించాల్సిన దృశ్యాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

చెప్పులు, పట్టా పాసు పుస్తకాలతో క్యూ లైన్

ప్రతీరోజు ఏ మండలంలో ఏ గ్రామంలో సొసైటీల వద్ద చూసినా రైతులు చెప్పులు, పట్టా పాసు పుస్తకాలతో క్యూలైన్‌లో ఉంటూ గంటల తరబడి నిరీక్షించాల్సిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. మరికొన్ని చోట్ల యూరియా కోసం రైతులు సొసైటీల ముందు, రోడ్లపై నిరసనలు తెలుపుతున్న సంఘటనలు నెలకొంటున్నాయి. తెల్లవారు జాము నుంచే రైతులు, వారి కుటుంబ సభ్యులు యూరియా కోసమే పనులు మానుకొని వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. యూరియా లోడ్ వచ్చిందంటే చాలు ఒక్క సంచి దొరికితే బంగారం దొరికినట్లుగా భావిస్తున్నారు. గంటల తరబడి నిరీక్షించినా ఒకటి రెండు బస్తాలు మినహాయిస్తే అదనంగా ఇవ్వడం లేదని రైతులు మండిపడుతున్నారు. అయితే యూరియాకు బదులు ద్రవరూపంలో ఉన్న నానో యూరియా అందుబాటులో ఉంటున్నప్పటికీ దానిపై వ్యవసాయ శాఖ రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతోంది.

8 ఫర్టిలైజర్ దుకాణాలపై కేసులు

జిల్లాలో వానాకాలం సీజన్‌తో పాటు యాసంగిలోనూ రైతులకు యూరియాతో పాటు ఇతర ఎరువులను పంపిణీ చేసేందుకు సహకార సంఘాలకు, ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలకు ప్రభుత్వం సరఫరా చేస్తోంది. అయితే జిల్లాలోని సొసైటీలతో పాటు ఆయా ప్రైవేట్ డీలర్లకు యూరియాను సీజన్‌కు ముందే సరఫరా చేసే డంప్ చేశారు. సీజన్ ప్రారంభమైనప్పటి నుంచే యూరియాకు రైతుల నుంచి డిమాండ్ నెలకొంటుండడంతో కృత్రిమ కొరత సృష్టిస్తున్నారనే వాదన వినిపించింది. దానికి తగ్గట్టుగానే కొందరు ప్రైవేట్ డీలర్లకు సరఫరా అయిన యూరియాను విక్రయించకుండా పక్కదారి పట్టించారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలాంటి సమయంలో వ్యవసాయశాఖ, నిఘా విభాగాలు ప్రైవేట్ డీలర్ల గోదాములు, దుకాణాల్లో తనిఖీలు చేయగా ఎరువుల నిల్వలపై తేడాలు గుర్తించారు. ప్రధానంగా యూరియా నిల్వల్లో తేడా ఉండడంతో 8 ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాలపై సంబంధిత శాఖ కేసు నమోదు చేసింది. ఈ కేసులను బట్టి చూస్తే ప్రైవేట్ ఫర్టిలైజర్ దుకాణాల వారు యూరియాను పక్కదోవ పట్టించి కృత్రిమ కొరత సృష్టించారనే విమర్శలు వస్తున్నాయి. ఇవేకాక ప్రస్తుతం రైతులు యూరియా కోసం నానా (మిగతా 8వ పేజీలో)



ఎండ వేడిమికి తట్టుకోలేక క్యూ పద్ధతిలో కవర్‌లలో జిరాక్స్ పాస్ బుక్‌లు పెట్టిన దృశ్యం

కాళ్లు మొక్కుతా సారూ..

- యూరియా ఎరువులు ఇవ్వండి
- వేడుకుంటున్న జుక్కల్ రైతులు 7



భాజన్ చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చూపుతున్న గ్రామస్థులు

భాజన్ చెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం

బీర్కూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బీర్కూర్ మండల కేంద్రంలోని భాజన్ చెరువు కట్ట కోతకు గురయ్యింది. వర్షాల కారణంగా కట్టపై మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కొంత మంది గ్రామస్థులు చెరువు కట్ట వద్దకు వెళ్లి కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా భాజన్ చెరువు కట్ట కోతకు గురయ్యిందని తెలిపారు. కట్ట ఎప్పుడు తెగుతుందో అని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతకు గురైన కట్టకు మరమ్మతులు చేపట్టి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట రమణరెడ్డి, ఎన్‌జీవోలు

బాల్య వివాహాల నిర్మూలనకు సహకరించాలి

• ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనకు ప్రజలందరూ సహకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి తెలిపారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గ్లోబల్ ఇంటర్ ఫెయిత్ ప్లడ్జ్ వీకెండ్ టూ ఎండ్ చైల్డ్ మ్యారేజ్ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల విద్యాభివృద్ధి, భవిష్యత్తు రక్షణకు ప్రపంచవ్యాప్తంగా మూడు రోజుల పాటు గ్లోబల్ ఇంటర్‌ఫెయిత్ ప్లెడ్జ్ నిర్వహించడం సంతోషించదగిన విషయమని తెలిపారు. ప్రతీ గ్రామ, పట్టణ పరిధిలో బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెంచుకోవాలని ఆడపిల్లలను భారంగా కాకుండా బాధ్యతగా పెంచాలని తెలిపారు. చిన్నారుల హక్కులను కాపాడేందుకు సమాజమంతా ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సాధన ఎన్‌జీఓ సంస్థ కో ఆర్డినేటర్ గిరిజ, మమత, సంధ్యరాణి, విశ్వజ్యోతి తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

పేదలకు ప్రభుత్వం అండ

• ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

సదాశివనగర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజక వర్గంలోని ప్రతీ పేదవారికి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని రాజంపేట, సదాశివనగర్, తాడ్వాయి, రామారెడ్డి మండలాల నుంచి వైద్య సహాయం కోసం దరఖాస్తు చేసుకున్న 53 మందికి మంజూరైనా రూ.17.57లక్షల చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య రంగంలో అండగా నిలబడడం ఎంతో సంతృప్తికరమన్నారు. ఇప్పటి వరకు అత్యధికంగా సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌వోసీ చెక్కులను పంపిణీ చేయడంతో ఎల్లారెడ్డి నియోజకవర్గం రాష్ట్రంలోని మొదటి స్థానంలో ఉండన్న విషయాన్ని గర్వంగా చెప్పగలగడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వంచే అందే సహాయం ప్రతీ ఒక్కరికి అందేలా ప్రత్యేకంగా నియమించబడిన టీం 24 గంటలు పని చేస్తుందన్నారు. వైద్య సేవలకు ఎవరైనా సహాయం కావాలంటే ఎల్లప్పుడు తన సహాయం అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. అవసరమైన ప్రతీ ఒక్కరికి సరైనా సమయంలో సరైన విధంగా సహాయం అందించడే విధంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

మళ్లీ పులి సంచారం

మద్నూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మద్నూర్ మండలంలోని శివారు ప్రాంతాల్లో చిరుత పులి సంచరిస్తుందని గత మూడు రోజులుగా రైతులు భయాందోళన చెందుతున్నారు. ఆదివారం సైతం మండలంలోని హండేకేలూర్ గ్రామ శివారులో చిరుతపులి చూసినట్లు కొందరు రైతులు గ్రామంలో చెప్పడంతో జుక్కల్ అటవీ ఫారెస్టు రేంజ్ అధికారి సుజాత మహారాష్ట్ర నుంచి వచ్చిన అటవీశాఖ అధికారులతో కలిసి పాదముద్రలను సేకరించారు. మండలానికి సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర గ్రామమైన నాగ్రాల్‌లో పులి ఉన్నట్లు కొందరు రైతులు పేర్కొనడంతో వారు మహారాష్ట్ర అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే మహారాష్ట్ర ఫారెస్టు అధికారులు స్పందించి పాదముద్రలను సేకరించారు. ఇరు రాష్ట్రాల అటవీ శాఖ అధికారులు పాదముద్రలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామని ఫారెస్టు రేంజ్ డిప్యూటీ అధికారి సుజాత వెల్లడించారు. రైతులు భయపడాల్సింది లేదని చిరుత పులికి సంబంధించిన ఆనవాళ్లు ఇంతవరకు దొరకలేదని సూచించారు.

చిరుత దాడిలో రెండు లేగదూడల మృతి

లింగంపేట: మండలంలోని నల్లమడుగు అటవీ ప్రాంతంలో చిరుత పులి దాడి చేసి రెండు లేగదుడలను హతమార్చినట్లు బాధిత రైతు దూప్‌సింగ్ తెలిపారు. నాలుగు రోజుల క్రితం ఆవుల మందను మేత కోసం అడవికి తీసుకువెళ్లగా సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా రెండు లేగ దూడలు కనిపించకపోవడంతో లేగ దూడల కోసం అటవీ ప్రాంతంలో వెతకగా ఆదివారం ఒక లేగ దూడ కుళ్లిపోయిన కళేబరం దొరకగా మరో లేగదూడ ఆచూకీ సైతం లభించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. చిరుత దాడిలోనే రెండు లేగదూడలు మృతి చెందాయని అటవీ అధికారులు నష్టపరిహారం అందజేయాలని బాధితుడు కోరుతున్నాడు. విషయాన్ని అటవీ అధికారులకు తెలియజేసినట్లు ఆయన తెలియజేశారు.



పాదముద్రలను సేకరిస్తున్న ఫారెస్ట్ రేంజ్ డిప్యూటీ ఆఫీసర్

‘సైబర్’ మోసంపై పీడీ యాక్ట్

- విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసిన వ్యక్తిపై పీడీ యాక్ట్
- రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సైబర్ నేరాల మీద పీడీ యాక్ట్ కేసు నమోదు
- నిజామాబాద్ పోలీసు కమిషనర్ సాయి చైతన్య

సుభాష్‌నగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు విదేశాల్లో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేస్తున్న వ్యక్తిపై పీడీయాక్ట్ కేసు నమోదు చేసినట్లు నిజామాబాద్ పోలీస్ కమీషనర్ సీపీ సాయిచైతన్య తెలిపారు. రాష్ట్రంలో మొట్టమొదటి సారిగా సైబర్ నేరాల మీద పీడీయాక్ట్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ప్రధాన సూత్రధారుడైన కోలనాటి నాగశివపై పీడీయాక్ట్ నమోదు చేసి చంచల్‌గూడ జైలుకు తరలించామని తెలిపారు. నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలోని కొంత మంది నిరుద్యోగ యువతకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికి లావోస్, తాయిలాండ్ దేశాలకు పంపించి అక్కడ సైబర్ నేరాలకు పాల్పడేలా బలవంతం చేసిన నాగశివను అరెస్టు చేసి పీడీయాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. పోలీసుల సమాచారం ప్రకారం నిందితుడు నాగశివ ఉద్యోగాలు ఇప్పిస్తానని, అధిక వేతనాలు ఇస్తానని చెప్పి లావోస్, తాయిలాండ్ దేశాలకు పంపించేవాడని అక్కడ వెళ్లిన తర్వాత వారి పాస్‌పోర్టులు స్వాధీనం చేసుకొని చట్టవిరుద్ధమైన సైబర్ మోసాలను బలవంతంగా చేయించేవాడని తెలిపారు. ఇతనిపై పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులు రాగా కేసు నమోదు చేసి పీడీయాక్ట్ నమోదు చేసినట్లు తెలిపారు. సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. ఎవరైనా యువతను అధిక వేతనాలు ఇప్పిస్తామని మోసపూరితమైన వాగ్దానాలు చేసి యువతను నమ్మించి ఉద్యోగాల పేరిట సైబర్ నేరాలకు పాల్పడేలా చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

వాహనదారులకు దిక్సూచి రాజ్‌మార్గ్ యాత్ర



ధర్మారం టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు చేసిన రాజ్‌మార్గ్ యాత్ర బోర్డు

పెద్ద కొడప్‌గల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా ప్రయాణాలు చేసే వారు కొత్త ప్రదేశాలకు వెళ్లే సమయంలో తాము వెళ్లాల్సిన చోటు గురించి తమకు తెలియక పోతే గతంలో వారిని వీరిని అడుగుకుంటూ గమ్యస్థానాలకు చేరేవారు. రాను రాను విజ్ఞానం పెరిగిన కొలది రహదారిపై సూచికలను చూస్తూ గమ్యస్థానాలకు చేరుతున్నారు. ఇటీవల కాలంలో అయితే కొత్తవారు తాము కోరుకున్న ప్రదేశాలకు వెళ్లడానికి గూగుల్ యాప్ సహాయంతో ప్రయాణాలు సాగిస్తున్నారు. అయితే వీటన్నింటితో పాటు కేంద్రం జాతీయ రహదారులపై ప్రయాణాలు సజావుగా సాగేందుకు రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చింది. ఈ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుండి వినియోగదారులు తమ మొబైల్‌ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని ఉపయోగించుకుంటే వారు ప్రయాణం చేసే రహదారిపై టోల్‌ప్లాజాలు, హోటల్స్, షాపింగ్ మాల్స్. పోలీస్‌స్టేషన్, రెస్టారెంట్లు. పెట్రోల్ బంక్ ఎక్కడ ఉన్నాయో చూపెడుతుంది. దీని ద్వారా వాహనదారులు తమకు కావాల్సిన సేవలను పొందవచ్చు.

ఒకే యాప్‌తో అనేక సేవలు

వాహనదారులు రాజ్‌మార్గ్ యాత్ర యాప్ ద్వారా అనేక సేవలను పొందవచ్చని జాతీయ రహదారులు విభాగం అధికారులు సూచిస్తున్నారు. తాము ప్రయాణించే రహదారిపై తమకు కావాల్సిన సేవలతో పాటు, రహదారిపై ట్రాఫిక్ పరిస్థితి, వాతావరణ హెచ్చరికలు, గమ్యస్థానానికి చేరుకునేందుకు పట్టే సమయం గురించి తెలుసుకోవచ్చు.

ఫిర్యాదులకు అవకాశం

జాతీయ రహదారులపై వాహనదారులు ప్రయాణం చేసే సమయంలో కలిగే ఇబ్బందులపై ఈ యాప్ ద్వారా పిర్యాదు చేయవచ్చు. రహదారులపై స్పీడు బ్రేకర్లు ఏర్పాటు, సూచన బోర్డులు, రహదారిపై గుంతలు కల్గి ఉండటం తదితర అంశాలపై (మిగతా 8వ పేజీలో)

ప్రైవేట్ కళాశాలలకు తాళాలు

- రేపటి నుంచి కళాశాలలు బంద్ చేసేందుకు సిద్ధమవుతున్న యాజమాన్యాలు
- మూడున్నర సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు బంద్
- జిల్లాలోని కళాశాలలకు రూ.70 కోట్ల వరకు బకాయిలు
- ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకువచ్చిన పథకం

కామారెడ్డి టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పేద, మధ్య తరగతి విద్యార్థులు సైతం ఉన్నత విద్యను అభ్యసించాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్‌ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం ప్రారంభించిన సమయంలో చాలా వరకు గ్రామీణ ప్రాంతాల పిల్లలు వృత్తిపరమైన ఉన్నత విద్యను అభ్యసించి ఇప్పుడు ఉద్యోగాలు సైతం చేస్తున్నారు. అలాంటి పథకం ప్రస్తుతం కనుమరుగవుతూ వస్తుండడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు ఎలాంటి ఆర్థిక భారం పడకుండా బోధిస్తూ ప్రభుత్వం అందించే స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్‌లను తీసుకునేవి. గత మూడున్నర ఏళ్లుగా ఎలాంటి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో పలుదఫాలుగా ప్రభుత్వాలకు వినతులు ఇస్తూ, నిరసనలు తెలుపుతూ వచ్చాయి. ఇక ప్రభుత్వంతో తాడోపేడో తేల్చుకునేందుకు మంగళవారం నుంచి కళాశాలలకు తాళాలు వేసి బంద్ చేసేందుకు సిద్ధమవుతున్నాయి. కేవలం కామారెడ్డి జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలకు రూ.70కోట్ల వరకు పెండింగ్ ఉన్నాయని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

జిల్లాకు రూ.70 కోట్ల వరకు పెండింగ్

జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి ప్రాంతాల్లోని ఇంటర్, డిగ్రీ, బీఈడీ ఇతర వృత్తిపరమైన కళాశాలలు ఉన్నాయి. ఈ కళాశాలలకు సుమారు రూ.70కోట్ల వరకు బకాయిలు రావాల్సి ఉంది. గత ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో ఎన్నికల్లో గెలిచేందుకు కంటితుడుపు చర్యగా కోట్లలో ఉన్న బకాయిలను లక్షల్లో చెల్లించి ప్రస్తుత ప్రభుత్వం చేతులుదులుపుకుందని ప్రైవేట్ యాజమాన్యాలు ఆరోపిస్తున్నాయి. ఎన్నికలు అయిపోయిన వెంటనే తమకు రావాల్సిన నిధులపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కావద్దని కొన్ని కళాశాలలు మానవతా దృక్పథంతో వారి సర్టిఫికెట్లు తిరిగి ఇచ్చేస్తుండగా మరికొన్ని కళాశాలలు ఫీజులు కట్టించుకుంటున్నాయి. విద్యార్థి సంఘాల నాయకులు సైతం పలు దఫాలుగా నిరసనలు వ్యక్తం చేసినా ప్రభుత్వంలో ఎలాంటి మార్పులేకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థుల చదువులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ప్రస్తుతం కళాశాలలు బంద్ చేసిన, వేలల్లో ఫీజులను విద్యార్థులకు కట్టే స్థోమత లేకపోతే ఉన్నత విద్య చదువులు అందకుండా పోతాయని విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రేపటి నుంచి కళాశాలలు బంద్

జిల్లాలో వృత్తిపరమైన కోర్సులు ఇంజనీరింగ్, బీ ఫార్మసీ, ఎంఫార్మసీ తదితర కోర్సులు లేవు. ఇంటర్, డిగ్రీ, బీఈడీ, ఇంటర్ స్థాయిలో వృత్తిపరమైన కళాశాలలు మాత్రమే ఉన్నాయి. ఈ కళాశాలల నిర్వహణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది వేతనాలు, అద్దె చెల్లింపులకు కష్టంగా మారిందని యాజమాన్యాలు పేర్కొంటున్నారు. సోమవారం ప్రభుత్వ స్పందనను పరిశీలించి సానుకూల స్పందన రాకపోతే కళాశాలల బంద్ చేసే ఆలోచనలు ఉన్నారు. ఇన్ని రోజులు విద్యార్థులను ఇబ్బందులు (మిగతా 8వ పేజీలో)


బైకు ట్రాలీతో గడ్డిని తీసుకెళ్తున్న రైతు

బైకును ట్రాలీగా మార్చిన రైతు!

వర్ని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కొత్త ఆలోచనతో ఓ యువ రైతు తనదైన శైలిలో ముందుకు సాగాడు. తనకున్న గేదెలు, 10 జెర్సీ ఆవులకు రోజువారీ మేత సమకూర్చడం కష్టంగా మారడంతో తానే ప్రత్యేక వాహనాన్ని రూపొందించుకున్నాడు. వర్ని మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన నూతలపాటి సురేందర్ తన బైకుకు ట్రాలీని ఏర్పాటు చేసుకున్నాడు. అందులో తన గేదెలు, ఆవులకు సరిపడా ఐదు క్వింటాళ్ల గడ్డి మోపులను పశువుల పాకకు చేర్చి మేతగా వేస్తాడు. పదో తరగతి చదివిన ఈ రైతు ట్రాలీ, బైకు ద్వారా గడ్డి కోయడంతో తోటి రైతులు ఆశ్చర్య పోతున్నారు.

కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలి

» టీయూసీఐ జిల్లా సంయుక్త కార్యదర్శి రమేష్


మాట్లాడుతున్న రమేష్

భీమ్‌గల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): హమాలీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ బీమా సౌకర్యం కల్పించాలని టీయూసీఐ జిల్లా సంయుక్త కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. టీయూసీఐ మహాసభ సందర్భంగా ఆదివారం పట్టణ కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద హమాలీ కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కార్మికులకు పని గంటలు పెంచే జీవో 282 రద్దుచేసి వివిధ ప్రైవేట్ కంపెనీలు గోదాములలో పనిచేస్తున్న హమాలీ కార్మికులకు ఉపాధి, భద్రతతో కూడిన సమగ్రమైన చట్టాన్ని తెచ్చి వీరికి పీఎఫ్, ఈఎస్ఐ బీమా సౌకర్యాలను కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, కార్మికులకు వేతనం రూ.26 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వర్, గంగాధర్, రాజన్న, నర్సయ్య, సుమన్, కిషన్, చిన్న నర్సయ్య, బుచ్చన్న, హమాలీలు, కార్మికులు పాల్గొన్నారు.

యూట్యూబర్‌లకు సన్మానం


యూట్యూబర్‌లను సన్మానిస్తున్న దృశ్యం

ఎడపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యూట్యూబర్‌లను ఆదివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కందగట్ల రాంచందర్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎడపల్లి మండల కేంద్రానికి చెందిన సంగం శ్రీనివాస్, కమ్మరి విరాట్‌లు 'సీనయ్య గుండె ఉన్నదే' అనే యూట్యూబ్ పాటలో తమ ప్రతిభను కనబరిచి ఎడపల్లి గ్రామాన్ని ప్రపంచానికి తెలిసేలా చేస్తున్నందుకు వారికి అభినందనలు తెలిపారు. మరిన్ని పాటలతో ప్రతిభను కనబర్చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లెపూల శ్రీనివాస్, లక్ష్మణ్‌గౌడ్, కంజర్ అభినవ్, దేరడి నాగేష్, రాఘవేందర్, తదితరులు ఉన్నారు.


రోడ్డుపైనే నిలిచిన మురుగు నీరు


పాఠశాల ప్రహరీ పక్కన చెత్త కుప్ప

ఎటుచూసినా చెత్తకుప్పలే..

» గ్రామాల్లో పడకేసిన పారిశుధ్యం
» జనావాసాల్లో నిలిచిన మురుగు నీరు
» కంపు కొడుతున్న పలు వార్డులు
» ఆసుపత్రుల్లో పెరుగుతున్న రోగులు
» పారిశుధ్య చర్యలు శూన్యం

ఎడపల్లి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యంతో ముడి పడి ఉన్న పారిశుధ్య చర్యలు గ్రామాల్లో పూర్తిగా పడకేశాయి. గ్రామాల్లో చూసినా చెత్తకుప్పలు, మురికి కుంటలే దర్శనమిస్తున్నాయి. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేందుకు ప్రత్యేకంగా కార్మికులను ఏర్పాటుచేసినా ఫలితం దక్కడంలేదు.

పారిశుధ్య చర్యలు కరువు

ఎడపల్లి మండలంలో 17 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో సుమారు 55వేలకు పైగా జనాభా ఉంది. ప్రతీ పంచాయతీల్లో మురుగు కాలువల్లో పూడిక, చెత్తను తొలగించడానికి పారిశుధ్య కార్మికులు ఉన్నారు. కార్మికులకు ప్రతీనెల వేతనాలలు, ట్రాక్టర్ల మెయింటెనెన్స్‌కు వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. నిధులు ఖర్చు అవుతున్నా పనులు మాత్రం సక్రమంగా చేపట్టడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఎడపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారంతోపాటు పాఠశాల ప్రహరీ పక్కన చెత్తవేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది.

రోడ్లపైనే మురుగు నీరు

మురుగు కాలువలను శుభ్రం చేయకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. రోడ్డు వెంట ఉన్న డ్రైనేజీలు మురుగునీటితో దర్శనమిస్తున్నాయి. నెలకు ఒకసారైన మురుగు కాలువల్లోని చెత్త, పూడికను తొలగించకపోవడం తో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలోని కొన్ని కాలనీల్లో పారిశుధ్య సమస్య తీవ్రంగా నెలకొంది. గ్రామంలోని 13, 14వ వార్డు, ఇందిరమ్మ కాలనీలలో మురుగు నీరు జనావాసాల మధ్య నిల్వ ఉంటుంది. దీంతో ఇళ్లలోకి దుర్వాసన వెదజల్లి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు శుభ్రత చర్యలు చేయించకపోతే సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. ఇప్పటికే పలు గ్రామాల్లో డెంగ్యూ బారినపడి పలువురు ఆసుపత్రుల పాలయ్యారు.

పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం

గ్రామాల్లో పారిశుధ్య సమస్యను అధికారులు తేలికగా తీసుకోవడంతో ప్రజలు అనారోగ్య బారిన పడుతున్నారు. రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువలు నిర్మించినా వర్షపు నీరు మురికి కాలువలోకి పోకుండా కొందరు తమ ఇంటి సమీపంలో మురుగు కాలువ కన్నా ఎత్తు మట్టి వేయడంతో వర్షపు నీరు మురుగు కాలువలోకి వెళ్లకుండా రోడ్లపైనే పారుతోంది. వర్షం నీరు రోడ్లపై గుంతల్లో నిలిచి దోమల వృద్ధికి కారణం అవుతున్నాయి. ప్రతీ గ్రామంలో ఇదే సమస్య ఉన్నా పంచాయతీ అధికారులు డ్రైనేజీల నిర్వహణ తీరుపై దృష్టి సారించడం లేదు.

ప్రజల్లో చైతన్యం రావాలి..

మన ఆరోగ్యం.. మన చేతుల్లో ఉందని ప్రజలు గుర్తిస్తే తప్పకుండా పారిశుధ్య నివారణలో భాగస్వాములు అవుతారు. ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం వేయడం మానుకోవాలి. తడి, పొడి చెత్తకు బకెట్లు ఏర్పాటుచేసుకొని తొలగించుకుంటే ఆరోగ్యం కాపాడుకోవడం సాధ్యమవుతుంది. చెత్త సేకరణకు వచ్చే ట్రాక్టర్‌లో చెత్త వేయకుండా ట్రాక్టర్‌వెళ్లిపోయిన తర్వాత చెత్తను రోడ్డుపక్కన పడేస్తూ పరిసరాలను ప్రజలే అపరిశుభ్రంగా మారుస్తున్నారు. ప్లాస్టిక్ కవర్ల వాడకం చాలా ప్రమాదమని తెలిసిన వాటినే ఎక్కువమంది వాడుతున్నారు. వీటిపై పంచాయతీల్లో ప్రజలకు పెద్దఎత్తున అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

ప్రభుత్వ కళాశాలలో శ్రమదానం

ఆర్మూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాలలో ఆదివారం ఆర్మూర్ మహాత్మా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శ్ర మదానం నిర్వహించారు. కళాశాల ఆవరణలో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, సంస్థ సభ్యులు ప్రశాంత్, నిశాంత్, శ్యాం సుందర్, రమేష్, మధుసూదన్ పాల్గొన్నారు.

యోగా గురువుకు సన్మానం


విశ్వనాథ్‌ను సన్మానిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

రుద్రూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన యోగా గురువు విశ్వనాథ్ మహాజన్‌ను ఆదివారం కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు. సికింద్రాబాద్‌లోని క్లాసికల్ గార్డెన్ పారడైస్‌లో ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా గురువు విశ్వనాథ్ మహాజన్‌ను అందిస్తున్న సేవలు అందించినందుకు ఆయనను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సన్మానించారు.

మెండోరలో దాటుడు పండుగ

మెండోర,సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ప్రజలు దాటుడు పండుగను ఆదివారం జరుపుకున్నారు. తమ పశువులు ఆరోగ్యంగా ఉండాలని ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామ పొలిమేరలో మూడు రహదారుల వద్ద ఓ పందిని పాతి దానిపై నుంచి దాటిస్తే పశువులు రోగాల బారిన పడవనేది గ్రామ ప్రజల విశ్వాసం. ఆ ఆచారాన్ని ప్రజలు చేస్తూ వస్తున్నారు. గ్రామ పొలిమేరలో వన భోజనాలు చేస్తూ సందడి చేశారు.

జాతీయస్థాయిలో ఏర్గట్ల విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న డీఈవో అశోక్

ఏర్గట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయి కవితా, కథల పోటీల్లో ఏర్గట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభకనబర్చి బహుమతులు సాధించారు. వురివెళ్ల ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతనెల నిర్వహించిన జాతీయ స్థాయి కవితా, కథల పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని నూనె శ్రీనిధి, పదో తరగతి చదువుతున్న అభిలాష్‌ను శనివారంరాత్రి జిల్లా విద్యాధికారి డీఈవో అశోక్ చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. విద్యార్థులను కవిత, కథల పోటీల్లో రాణించడానికి కృషిచేస్తున్న తెలుగు పండితుడు ప్రవీణ్ శర్మను అభినందించారు. కార్యక్రమంలో కోశాధికారి చింతల శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

రైలు ఢీకొని ఒకరు మృతి

» గన్నారంలో విషాద ఛాయలు

ఇందల్వాయి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందల్వాయి రైల్వేగేట్ సమీపంలో రైలు ఢీకొని ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. మండలంలోని గన్నారం గ్రామానికి చెందిన బద్దం రవీందర్‌రెడ్డి (46) వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఉదయం గ్రామ శివారు రైలు పట్టాల పక్కన గల తన వ్యవసాయ భూమి వద్దకు పనుల నిమిత్తం వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ఈ క్రమంలో ఇందల్వాయి రైల్వేస్టేషన్ వద్ద రైలు రావడాన్ని గమనించక పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డ్రైనేజీలో మృతదేహం లభ్యం

బోధన్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి శివసాయి కాలనీ సమీపంలో ఆదివారం ఉదయం అక్కడి డ్రైనేజీలో ఓ యువకుడి మృతదేహం లభించిందని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. మృతుడి 42 ఏళ్లు ఉండవచ్చని, మృతదేహంపై నీలిజీన్స్, ఫుల్ హ్యాండ్ బ్లాక్ కలర్ టీషర్ట్ ఉన్నాయని పేర్కొన్నారు. మృతుడి ప్యాంట్ జేబులో లభించిన ఆధార్‌కార్డు ప్రకారం మృతుడు ఎడపల్లి మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన లక్ష్మణ్(42), తండ్రి పేరు విఠల్‌గా ఉందని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. దర్యాప్తును అన్ని కోణాల్లో చేపడుతున్నామని సీఐ తెలిపారు.

దొంగతనం కేసులో వ్యక్తికి రూ.15వేల జరిమానా

లింగంపేట, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోమట్‌పల్లి గ్రామానికి చెందిన కోకట్ల భీరయ్యకు చెందిన కొట్టంలో నుంచి గొర్రెలను దొంగలించేందుకు ప్రయత్నించిన వ్యక్తికి గ్రామస్థులు రూ.15వేలు జరిమానా విధించారు. కన్నాపూర్ తండాకు చెందిన ఓ వ్యక్తి శనివారం రాత్రి కోమట్‌పల్లికి చెందిన భీరయ్య గొర్రెల కొట్టంలో నుంచి గొర్రెను దొంగలించేందు ప్రయత్నించాడు. దీన్ని చూసిన గ్రామస్థులు అరవడంతో ఆ వ్యక్తి బైక్‌పై పారిపోయాడు. గ్రామానికి చెందిన యువకులు, బాధిత కుటుంబ సభ్యులు బైక్‌లపై వెంబడించి దొంగతనానికి వచ్చిన వ్యక్తిని పట్టుకుని పట్టుకున్నారు. నిందితుడు నేరం అంగీకరించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆదివారం పంచాయతీ నిర్వహించి సదరు వ్యక్తికి రూ.15వేలు జరిమానా విధించినట్ల గ్రామస్థులు తెలిపారు.

ధర్పల్లిలో రెండు ఇళ్లు దగ్ధం

ధర్పల్లి, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోగల గోసంగి కాలనీలో ఆదివారం ఉదయం రెండు ఇళ్లు దగ్ధమయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. గోసంగి కాలనీకి చెందిన సల్ల భాగ్య, తుర్పాటి సాయవ్వ నివాసం ఉంటున్నారు. ఉదయం రెండు ఇళ్లలో షార్ట్ సర్క్యూట్‌తో ఇళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఇంట్లో గల వస్తువులు, నిత్యావసర సరుకులు, వెండి, బంగారం అగ్నికి ఆహుతయ్యాయి. కట్టుబట్టలతో రెండు కుటుంబాలు వీధినపడ్డాయి. విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు ఆర్మూర్ చిన్న బాల్‌రాజ్, సింగిల్ విండో చైర్మన్ చెలిమెల మల్లికార్జున్, చెలిమెల శ్రీనివాస్‌లు బాధిత కుటుంబాలను పరామర్శించి నిత్యావసర సరుకులను బ్లాంకెట్‌లు, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో దినకర్, బాలయ్య, రాకేష్, చక్రపాణి, తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం నుంచి ఆర్థికసహాయం అందేలా చూస్తామని బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చారు. అన్నివిధాలుగా అండగా ఉంటామని చెప్పారు.

పోచారం ప్రాజెక్టు సందర్శన కోసం వచ్చి ప్రమాదవశాత్తు యువకుడి మృతి


షేక్ మహబూబ్ మృతదేహం

నాగిరెడ్డిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పోచారం ప్రాజెక్టు సందర్శన కోసం వచ్చిన ఓ యువకుడు ఆదివారం ప్రమాదవశాత్తు ప్రాజెక్టు వద్ద నీటిలో పడి మృతిచెందాడు. స్థానిక ఎస్సై భార్గవ్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణానికి చెందిన యువకుడు షేక్ మహబూబ్ (20) తన స్నేహితులతో కలిసి ఆదివారం పోచారం ప్రాజెక్టు సందర్శన కోసం వచ్చాడు. ప్రాజెక్టు వద్ద దిగువ నీరు పొంగిపొర్లు తుండటంతో ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందినట్లు ఆయన తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన తెలిపారు.



బోధన్ మార్కెట్ కమిటీ నుంచి స్టడీటూర్ ప్రారంభిస్తున్న దృశ్యం

మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో స్టడీ టూర్

బోధన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బోధన్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మహారాష్ట్రలోని నాందేడ్, సాంగ్లీ మార్కెట్‌లను సందర్శించనున్నట్లు బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ శంకర్ తెలిపారు. ఆదివారం బోధన్ మార్కెట్ కమిటీ నుంచి మహారాష్ట్రకు స్టడీ టూర్ వెళ్తున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. మహారాష్ట్రలోని మార్కెట్‌లను సందర్శించి అక్కడి వ్యాపారాలు, వ్యవసాయలాభాలను తెలు సుకునేందుకు వెళ్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ బోధన్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వసంత్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

భీమ్‌గల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివిన 1993-1994 బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 30 ఏళ్ల తర్వాత చిన్ననాటి మితులు అంతా ఒకే వేదికపై చేరుకుని తమ మధుర స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఈ సందర్భంగా తమకు చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు యోగేశ్వర నర్సయ్య, పల్లెల చంద్రశేఖర్, పఠాని లింబాద్రి, అబ్దుల్ బారి, ఆనంద్, నరేష్, నరేందర్, మధు పాల్గొన్నారు.

పిప్రిలో కంటి వైద్య శిబిరం

ఆర్మూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్రిలో ఆదివారం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో స్నేహ లేజర్ ఐ హాస్పిటల్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 130 మందిని వైద్యులు పరీక్షించి ఉచిత మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. మోతెబిందు, కంటిపొర లాంటి సమస్యలున్న వారిని నిపుణులు పరిక్షించారు. కార్యక్రమంలో కంటి వైద్యురాలు స్నేహ, వీడీసీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యేలు

సైన్స్ ఫెయిర్‌లో విద్యార్థుల ప్రతిభ

భీమ్‌గల్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): కామారెడ్డిలోని శ్రీ సరస్వతీ విద్యామందిర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ మేళాలో భీమ్‌గల్ సరస్వతీ విద్యామందిర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 12, 13, 14 తేదీల్లో నిర్వహించిన ఈ పోటీలలో రాష్ట్రంలోని అన్నిజిల్లాల శిశుమందిర్ విద్యార్థులు పాల్గొనగా భీమ్‌గల్ సరస్వతి విద్యామందిర్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో మొదటి, ద్వితీయ స్థానాలు సాధించి సత్తాచాటారు. సీహెచ్ నిత్యశ్రీ, ఎస్.మహాలక్ష్మీ, గణిత విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానాన్ని సాధించగా, ఎం.శ్రీఆద్యారెడ్డి రెండో స్థానాన్ని సాధించింది. కే.చైత్ర సైన్స్ విభాగంలో, వై.శ్రీకరి సంస్కృతి బోధ పరియోజన విభాగంలో రాష్ట్రస్థాయిలో మొదటిస్థానాలు సాధించారు. వీరికి కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్‌మోహన్‌రావు మెమెంటోలను అందజేశారు.

ముగిసిన ఎన్‌ఎస్ఎస్ శిబిరం


విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ప్రిన్సిపాల్

మాక్లూర్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్రాద్, ముత్యంపల్లిగ్రామాల్లో నిజామాబాద్ ఉమెన్స్‌కళాశాల ఎన్‌ఎస్ఎస్ విద్యార్థినులు నిర్వహించిన శీతాకాల శిబిరం ఆదివారం ముగిసింది. వారం రోజుల పాటు విద్యార్థినీలు గ్రామాల్లో శ్రమదానం నిర్వహించి పచ్చదనం, పరిశుభ్రత, అక్షరాస్యత, మూఢ నమ్మకాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముగింపు సమావేశానికి నిజామాబాద్ జిల్లారైస్‌మిల్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ దన్‌కాంత్ ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థినిలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ భారతిరెడ్డి, ప్రోగ్రాం అధికారిణిలు మాధవి, మమత, ఎన్‌ఎస్ఎస్ వాలీంటర్లు పాల్గొన్నారు.

హిందీ భాషను అందరూ నేర్చుకోవాలి

బోధన్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): మన జాతీయ భాషను ప్రతీఒక్కరు నేర్చుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు కే.పద్మజ అన్నారు. బోధన్ పట్టణంలోని పాండుఫారంలో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఆదివారం హిందీ భాష దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు సంధ్య మాట్లాడుతూ 1949 సెప్టెంబరు 14న హిందీ భాషను అధికారిక భాషగా ప్రకటించారని, ప్రపంచంలో హిందీభాష రెండోస్థానంలో ఉందని తెలిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

భీమ్‌గల్ రూరల్, సెప్టెంబరు, 14(ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్‌లోని శ్రీభారతి విద్యాలయం 2004-2005 బ్యాచ్ పదోతరగతి పూర్వవిద్యార్థులు మిత్రుడు నిచ్చామోళ్ల వినోద్ జ్ఞాపకార్థం ఆదివారం ఆర్మూర్‌లోని లాలన వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. నర్సరీ నుంచి పదో తరగతి వరకు చదువుకున్న మిత్రుడి ఆత్మకుశాంతి కలగాలని ప్రార్థించారు. కార్యక్రమంలో మిత్రులు సుంకరి సురేష్, వంశీకృష్ణ, కాసార్ల వినోద్, సాయిబాబా, రాకేష్, వాకా మహేష్, శివ, విక్రమ్, దయ్య అనిల్, తోట సతీష్, నరేష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ


దేగాంలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వినయ్‌రెడ్డి

ఆర్మూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ మండలం దేగాంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించారు. గ్రామానికి చెందిన దశగౌడ్, వినోద్‌కుమార్‌లు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబాలను వినయ్‌రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు యాదగౌడ్, మాజీఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, లోక ముత్యంరెడ్డి, ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండలంలో పలు బాధిత కుటుంబాలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ పరామర్శించారు. మండలంలోని కోనాపూర్‌కు చెందిన బడాల లింగారెడ్డి ఇటీవల అనారోగ్యంతో మరణించగా ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు. అదే గ్రామానికి చెందిన తెడ్డు గంగారాం మరణించడంతో బాధిత కుటుంబాన్ని సునీల్‌కుమార్ పరామర్శించి ఓదార్చారు. అలాగే కోనాసమందర్ గ్రామానికి చెందిన భిక్షపతి ఇటీవల గుండెపోటుతో మరణించగా ఆయన కుటుంబసభ్యులను, అదేగ్రామానికి చెందిన బద్దం కిషన్‌రెడ్డి మరణించడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. ఆయనవెంట కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు పడిగెల ప్రవీన్, ఎడ్ల శ్రీకాంత్, లింగారెడ్డి, చిన్నోళ్ల రెడ్డి, హన్మాండ్లు, గంగరాజం, జల్పతిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల్లో ఆలోచన జ్ఞానాన్ని పెంచాలి

బోధన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో భాషావృద్ధిని పెంపొందిస్తూనే ఆలోచన జ్ఞానాన్ని పెంచేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని విజయసాయి పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్ అన్నారు. ఆదివారం జాతీయ భాషా దినోత్సవం, హిందీ దివాస్ పురస్కరించుకుని విజయసాయి ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వర్ణమాల, హిందీలో వారాలు, నెలలు, ఆటలతో భాష పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ మోహన్, పీఆర్‌వో చక్రవర్తి, పాఠశాల అకాడమీ ఇన్‌చార్జి సువర్చల, హిందీ ఉపాధ్యాయులు సతీష్ జోషి, జయశ్రీ, గంగాధర్, రేఖ, రజిత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మిలాద్-ఉన్-నబీ వేడుకలు

కోటగిరి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లింలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని అందరూ ఐక్యంగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మైనారిటీ నాయకులు యాదుల్, ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ బన్సీలాల్ పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు

» యూరియాపై ప్రశాంత్‌రెడ్డి చీప్ ట్రిక్స్
» కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్

మోర్తాడ్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): యూరియా విషయంలో రైతులు ఆందోళన చెందవద్దని, కావాల్సినంత యూరియా అందుబాటులోకి వస్తుందని కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం మోర్తాడ్‌లోని ప్రజాభవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని యూరియా విషయంలో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చీప్‌ట్రిక్స్ ప్లేచేస్తు బదునం చేస్తున్నారని ఆరోపించారు. జిల్లాకు ఇప్పటివరకు ఎంత యూరియా సరఫరా అయిందో కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. యూరియా లోటు ఉంటుందని, యూరియాను మోతాదులో వాడుకోవాలని సీజన్ ప్రారంభంలోనే ప్రధాని చెప్పారని గుర్తుచేశారు. 2022-23లో జిల్లాకు 27,782 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని, 2023-24లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దాదాపు 35వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా జరిగిందని, 2024-25లో ఇప్పటివరకు 42వేల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని వివరించారు. అడ్డగోలుగా అబద్దాలు మాట్లాడే ప్రశాంత్‌రెడ్డి ఈ విషయాలను తెలుసుకొని మాట్లాడాలనిన్నారు. బాల్కొండకు 2022-23లో 7,181 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చిందని, 2023-24లో కాంగ్రెస్ పాలనలో 9,861 మెట్రిక్ టన్నులు, 2024-25లో 11,247 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయినట్లు వెల్లడించారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తే ఊరుకోబోమన్నారు. సమావేశంలో పీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ పాలెపు నర్సయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శివనొల్లా శివకుమార్, ఏర్గట్ల, మోర్తాడ్ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు సోమ దేవారెడ్డి, ముత్యాల రాములు, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మనోహర్‌రెడ్డికి ఘననివాళి


మాట్లాడుతున్న సునీల్ కుమార్

మోర్తాడ్, సెప్టెంబరు14 (ఆంధ్రజ్యోతి): పసుపుబోర్డు ఏర్పాటుకు అహర్నిషలు కృషిచేసిన ఉద్యమనేత ముత్యాల మనోహర్‌రెడ్డికి రైతులు, నాయకులు పార్టీలకు అతీతంగా నివాళులు అర్పించారు. మండలంలోని పాలెంలో రైతులు ఏర్పాటు చేసిన ప్రథమ వర్ధంతికి పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ హాజరై మాట్లాడారు. జిల్లాలో పసుపు బోర్డు కోసం ఆయన పాదరక్షలు తొడగనని శపథం చేశారని, కేంద్ర ప్రభుత్వం పసుపు బోర్డును ప్రకటించిన తర్వాతే పాదరక్షలు ధరించారని అన్నారు. ఆయన సర్పంచ్‌గా సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో రైతు సంఘాల సభ్యులున్నారు.

కాళ్లు మొక్కుతా సారూ

» అందని ద్రాక్షగా మారిన యూరియా
» వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులకు వేడుకుంటున్న జుక్కల్ రైతులు

జుక్కల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం యూరియా ఎరువులు నామమాత్రంగా పంపిణీ చేయడంతో రైతులకు యూరియా అందని ద్రాక్షగా మారింది. మండలంలో వివిధ గ్రామాల్లో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి, సోయా, పత్తి పంటలు పెరగడానికి రైతులు యూరియా ఎరువులు చల్లుకుంటారు. జుక్కల్ మండలంలో రైతులు ఎక్కువగా వరి ఆరుతడి పంటలు సాగు చేస్తారు. యూరియా డిమాండ్ ఎక్కువగా ఉండడంతో రైతులకు యూరియా దొరకడం లేదు. జుక్కల్ సొసైటీకి నామమాత్రంగా ఎరువులు లారీ రావడంతో ఒకే గంటలో ఎరువులు విక్రయాలు అయిపోతున్నాయి. కొందరు రైతులకు ఒక బస్తా ఎరువు దొరికిన మరికొందరు రైతులకు వరుసలో నిలబడిన ఎరువులు నిల్వలు అయిపోవడంతో నో స్టాక్ బోర్డులు పెట్టి సొసైటీ అధికారులు రైతులకు వెనుకకు పంపుతున్నారు. జుక్కల్ మండలంలో వ్యవసాయ భూమి విస్తీర్ణం ఎక్కువగా ఉండడంతో యూరియాకు బాగా డిమాండ్ ఉంది. ఇటీవల భారీ వర్షాలు కురవడంతో రైతులు సాగు చేస్తున్న పంట పొలాలకు యూరియా, ఎరువులు చల్లుకోవాలని భావిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం యూరియా ఎరువులు నామమాత్రంగా పంపిణీ చేయడంతో రైతులకు యూరియా, ఎరువులు అందని ద్రాక్షగా మారిందని రైతులు ఒకరితో మరొకరు చెప్పుకోవడం గమనార్హం. గత ప్రభుత్వంలో రైతులకు ఇబ్బంది లేకుండా ఎరువులు, యూరియా కాలంలో పంపిణీ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో డబ్బులు పెడితే సమయానికి మద్యం దొరుకుతుంది. కానీ రైతులకు డబ్బులు ఇచ్చిన అధికారులు యూరియా, ఎరువులు ఇవ్వడం లేదని రైతులు అన్నమో రామచంద్ర అంటూ దిగులు చెందుతున్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఖజానా నిప్పుకోవడానికి ముందు చూపుతో మద్యానికి టెండర్లు పిలుస్తున్నారు. రైతులకు ఎరువులు అవసరం ఉంటుందని, ముందు ప్రణాళికలతో ఎరువులు ఎందుకు తెప్పించడం లేదని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శించారు. రైతులకు వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉన్నప్పటికీ పనులు వదిలిపెట్టి సొసైటీల వద్ద ఒక బస్తా ఎరువు కొరకు నిరీక్షణ చేస్తున్నామని రైతులు వాపోతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జూన్ నెలలో వర్షాకాలం ప్రారంభంలో రైతులకు ఎరువులు ఎంత మెట్రిక్ టన్నులు అవసరం ఉంటుందో కేంద్ర ప్రభుత్వంతో చర్చించి ఎరువులు సరఫరా చేయాలని ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడం వ్యవసాయ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని రైతులు బహిరంగంగా ఆరోపణ చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు మధ్య రైతుల మధ్య గొడవ పెట్టి ఎరువులు పంపిణీ చేయడం ప్రభుత్వానికి సిగ్గుచేటని రైతులు విమర్శించారు. రాష్ట్రానికి అన్నం పెట్టే రైతన్నకు ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. డబ్బులు తీసుకొని అధికారులు ఎరువులు ఇవ్వమంటే పొలిటికల్ లీడర్లకు పలుకుబడిన నాయకులకు ఎరువులు ఇస్తున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. కష్టపడే రైతులకు పంటలు సాగు చేయడానికి ఇబ్బందులు తప్పడం లేదని రైతులు గోషపెడుతున్నారు. వ్యవసాయ శాఖ అధికారులు ముందు చూపుతో ఎరువులకు ప్రతిపాదనలు పంపడం లేదని రైతులు వ్యవసాయ అధికారులపై వ్యక్తం చేస్తున్నారు. ఇక ఇకనైనా ఎరువులు తెప్పించి సకాలంలో పంపిణీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. లేనిచో ఎరువులు పంపిణీ నిలిపివేస్తే పంటలు సాగు చేయకుండా రైతులు ఐక్యమత్యంగా ఉండి రోడ్లపై తిరుగుబాటు జెండా ఎగరవేస్తామని రైతులు అన్నారు.



పోలీసు బందోబస్తు మధ్య ఎరువులు తీసుకుంటున్న రైతులు (ఫైల్)



యూరియా పంపిణీ వద్ద గుమిగూడిన రైతులు

● 20 మెట్రిక్ టన్నులు యూరియా అవసరం

జుక్కల్ మండలంలో రైతులు సాగు చేస్తున్న పంటలకు 20 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందని వ్యవసాయ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు మండల వ్యవసాయ అధికారి మహేశ్వరి తెలిపారు. ఇప్పటి వరకు యూరియా బస్తాలు చాలా తెప్పించామని రైతుల డిమాండ్ బట్టి మరి కొన్ని టన్నులు యూరియా తెప్పించడానికి ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రయత్నం చేస్తున్నామని ఆమె అన్నారు. ప్రతీఒక్క రైతుకు యూరియా పంపిణీ చేస్తామని రైతులు దిగులు చెందవద్దని వ్యవసాయ అధికారి తెలిపారు.

- మహేశ్వరి, మండల వ్యవసాయ అధికారి



కళాశాలకు ప్రొజెక్టర్ అందజేస్తున్న దృశ్యం

కళాశాలకు ప్రొజెక్టర్ అందజేత

బాన్సువాడటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిజిటల్ విద్యాసౌకర్యాలు కల్పించాలని పోలీసు అధికారులు అభినవ్ చతుర్వేది, సంజీవ్, సాజిద్‌లు ప్రొజెక్టర్‌ను అందజేశారు. ఆదివారం నోడల్ అధికారి సలాంకు ఈ ప్రొజెక్టర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నవయస్సుల్లోనే పెద్ద లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని , కష్టపడి చదివితే అన్ని రంగాలలో రాణించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శివకుమార్, సీడీసీ సభ్యులు ఏజాస్ , దాసరి శ్రీనివాస్, సురేశ్, నరేశ్ , శంకర్ తదితరులున్నారు.

అంత్యక్రియలకు ఆర్థికసాయం



బాధిత కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకుడు సాయిలు

నసురుల్లాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాచుపల్లి గ్రామానికి చెందిన బిజెపి బోథ్ అధ్యక్షులు బండపల్లి శ్రీను వాళ్ల తండ్రి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న బిజెపి కామారెడ్డి జిల్లా కౌన్సిల్ సభ్యుడు సున్నం సాయిలు కార్యకర్తలతో కలిసి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం మృతుని కుటుంబ సభ్యులకు అంత్యక్రియల కోసం తమ వంతు సహాయంగా రూ.4,600 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల సీనియర్ నాయకులు అనుసూరి శ్రీనివాస్, అరిగె నారాయణ, పెర్క రాములు, గొడిసెల యాదగిరిగౌడ్, మనూర్ సాయిలు, ర్యాపని మహేష్, కొప్పుల సాయిలు, జల్ల సాయి పాల్గొన్నారు.

ఆర్టీసీలో యాత్రదానం టూర్ ప్యాకేజీ

బాన్సువాడ టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలో తాజాగా యాత్రదానం టూర్ ప్యాకేజీ అందుబాటులోకి తీసుకవచ్చినట్లు బాన్సువాడ డిపో మేనేజర్ సరితాదేవి తెలిపారు. పేదలకు , వృద్ధులకు , వికలాంగులకు యాత్రలు చేయాలని కోరిక ఉంటుందని, వారి ఆశలను తీర్చే దాతలు డిపో సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

ముస్లిం వెల్ఫేర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న దృశ్యం

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని మైనారిటీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సేమ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఎల్లారెడ్డి ముస్లిం వెల్ఫేర్ అధ్యక్షుడు గయాజుద్దీన్ మాట్లాడుతూ రక్తదానం చేయడానికి యువత స్వచ్ఛందంగా ముం దుకు వచ్చి రక్తదానం చేయడం అభినందనీయమని రక్తదానం వల్ల అపోహాలను వీడి ముందుకు రావాలని తెలిపారు. ఈ శిబిరంలో మొత్తం 22 యూనిట్లు రక్తాన్ని సేకరించినట్లు డాక్టర్ బాలు తెలిపారు.

క్రీడాకారులకు వాలీబాల్ కిట్ అందజేత



మల్లాపూర్‌లో క్రీడా కారులకు వాలీబాల్ కిట్ అందజేస్తున్న దృశ్యం

బీర్కూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం మల్లాపూర్ గ్రామంలో వాలీబాల్ క్రీడా కారులు ఉన్నారు. అయితే మల్లాపూర్ గ్రామానికి చెందిన వడ్ల ముడి రవి, వేణులు ఆదివారం క్రీడా కారులకు వాలీబాల్ కిట్‌లను అందజేశారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో తమవంతుగా వాలీబాల్ కిట్‌లను అందజేసినట్లు వారు తెలిపారు. క్రీడాకారులు చక్కగా ప్రాక్టీస్ చేసి మ్యాచ్‌లో తమ సత్తా చాటాలని రవి, వేణులు క్రీడాకారులతో అన్నారు. భవిష్యత్తులో క్రీడా కారులకు తనవంతు సహాయ సహకారాలు అందజేస్తామని అన్నారు.

వీధి కుక్కల వలస

నందిపేట, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కు టుంబ పోషణకు దేశం కానీ దేశానికి వలస వెళ్లడం చూశాం. కానీ వీధి కుక్కలు ఎప్పుడైనా గ్రామం నుం చి మరో గ్రామానికి వలస వెళ్లడం చూశారా?. వీధి కుక్కలు ఏంటీ, వలస వెళ్లడం ఏంటీ అనుకుంటున్నారా.. అవునండీ, నిజమే. ఆదివారం నందిపేట మండలంలోని వెల్మల్ గ్రామ శివారులోని బైపాస్ రోడ్డులో 30కి పైగా వీధి కుక్కలు సంచరించడాన్ని ఆంధ్రజ్యోతి కెమెరాలో బంధించింది. ప్రయాణికులను అలాగే రోడ్డుకు ఇరువైపులా పొలాల్లో పని చేసే రైతులను ఆరా తీయడంతో ఆలూర్ మండల కేంద్రం నుంచి వెల్మల్‌కు వలస వచ్చినట్లు తెలిపారు.



వెల్మల్ బైపాస్ రోడ్డులో సంచరిస్తున్న వీధి కుక్కలు

కాంగ్రెస్ హయాంలో అన్ని వర్గాలకూ సంక్షేమం

● కల్యాణలక్ష్మీ చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోని అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను 59 మందికి, 16 లక్షల తొంబై ఐదు వేల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ఓసి చెక్కుల పంపిణీలో రాష్ట్రంలోనే ఎల్లారెడ్డి నియోజకవర్గం మొదటి స్థానంలో ఉందన్నారు. అలాగే ప్ర భుత్వం అందించే ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఆర్థికంగా ఎంతో ఉపయోగపడుతుందని ప్రభుత్వ పథకాలు ఎన్నో కుటుంబాలకు జీవనాధారంగా మారుతున్నాయని అవసరమైన ప్రతీ ఒక్కరికి సరైన సమయంలో సరైన విధంగా సహాయం అందించడమే బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో పార్థసింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత రెడ్డి, మండల అధ్యక్షుడు సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్ గౌడ్, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బంజారా సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



నూతనంగా బంజారా యూత్ కమిటీ ఇదే

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం మండల నూతన యూత్ కమిటీని ఆదివారం ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఎల్లారెడ్డి మండలాధ్యక్షుడు అధ్యక్షుడు కోలా రాములు నాయక్, ఆధ్వర్యంలో మండల, ఉద్యోగ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఎన్నుకున్న ట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆల్ ఇండియా బంజారా సంఘ్ మండల యూత్ అధ్యక్షుడిగా మాలోత్ గణేష్ నాయక్, ప్రధానకార్యదర్శిగా కుల సేవ్య, గౌరవ అధ్యక్షుడిగా సభావత్ జీవన్, ఉపాధ్యక్షులుగా మాలోత్ సుభాష్, సహాయ కార్యదర్శులుగా అంగోత్ రాజేందర్, మెగావత్ సంతోష్, కోశాధికారులుగా ధరావత్ బన్సీలాల్, సభావత్ సంగ్రామ్, ప్రచార కమిటీ సభ్యులుగా ధరావత్ రాంజీ, ప్రధాన సలహాదారులుగా ధరావత్ విజయ్, రత్నావత్ లచ్చిరామ్, క్రీడా కార్యదర్శిగా సభావాత్ కుమార్, లక్ష్మణ్, సంస్కృతిక కార్యదర్శిగా ధనావత్ బన్సీలా ల్, ధరావత్ ప్రేమ్ సింగ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతనం గా ఎన్నికైన కమిటీలు బంజారాల అభ్యున్నతి కోసం కృషి చేస్తామని తెలిపారు.

భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్లు

» రాకపోకలకు ఇబ్బందులు
» ప్రమాదమని తెలిసినా పట్టించుకోని అధికారులు



ఏర్గట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని రోడ్లు దెబ్బతిని రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేం ద్రం నుంచి జగిత్యాల జిల్లా మెట్‌పల్లికి వెళ్లే దారిలో రోడ్డు చెడిపోయింది. రోడ్డుపై నీరు నిలవడంతో పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి కొత్తగా వచ్చే ప్ర యాణికులు అ గుంతల్లో పడి ప్రమాదాల భారిన పడుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికి పట్టించుకోవడం లేదని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండేళ్ల గడుస్తున్నా నేటికి మరమ్మతులు లేక ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇదే రోడ్డుపై భారీ వాహనాలు వెళ్లడంతో ఆ గుంతల్లో ఇరుక్కుపోతున్నాయి. వాటిని తీసేందుకు వాహనదారులు జేసీబీల సహాయంతో వాహనాలను బయటకు తీసే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని వాహనధారులు కోరుతున్నారు.



రొడ్డు మధ్యలోకి కుంగిపోయిన వ్యాన్


గత రెండేళ్లుగా ఇదే పరిస్థితి..
పొత్కూరి మహేష్, రైతు ఏర్గట్ల



మండల కేంద్రంలోని మెట్‌పల్లికి వెళ్ళే దారిలో తీగల వాగు సమీపంలో రోడ్డు చెడిపోయి దాదాపు రెండేళ్ళు గడుస్తోంది. ఈ రోడ్డు మీదుగానే భారీ వాహనాలతో పాటు రైతు వ్యవసాయ క్షేత్రాలకు వెళుతుంటాము. భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతినడంతో రాత్రిల్లో ప్రమాధాలు ఎక్కువగా జరుగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని ప్రమాధాలు జరగకుండా చూడాలి.

అపురూపం ఆయన చిత్ర కళారూపాలు

● వర్ని వాసికి బాపూ చిత్ర కళా జాతీయ పురస్కారం



బలవీర్ గీసిన మీరాబాయి, సంత్ సావ్లా మహారాజ్ చిత్రాలు



బాలకృష్ణ, చిత్రకారుడు

వర్ని, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వర్ని మండల పరిధిలోని పాతవర్ని గ్రామానికి చెందిన ఇందూరు బలవీర్ బాలకృష్ణకు ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. చిన్ననాటి నుంచే చిత్ర లేఖనంపై ఆసక్తి పెంచుకున్న ఆయన ఎందరో మహానుభావులు, అన్ని రకాల దేవతా మూర్తుల ఆకారాలను తనదైన శైలిలో చేతి ద్వార గోడలు, పాఠశాలలు, మందిరాలు ఏ ప్రదేశంలోనైనా వేస్తూ ప్రజలు, కవులు, మేధావులచే ఔరా అనిపించుకునే స్థాయికి ఎదిగారు. బలవీర్ చిత్రాలు భలేగా ఉండటంతో ఆయన నైపుణ్యాన్ని గుర్తించి చిత్రలేఖనం కోసం పోటీపడి ఆహ్వానించడం గర్వకారణం. దేశ ప్రముఖులు, దేవతా రూపాలు, ప్రకృతి పంట పొలాలు, నదుల బొమ్మలు వంటివి కళ్లకు కట్టినట్లు వేయడంలో బాలవీర్ దిట్ట. ఈయన ప్రతిభను గుర్తించి తెలంగాణ ఐకాన్ పురస్కారంతో పాటు, 22న వసుంధర విజ్ఞాన వికాస మండలి వారు రవీంద్రభారతిలో బాపు జాతీయ పురస్కారానికి ఎంపిక చేశారు. 32ఏళ్లుగా సామాజిక, సాంస్కృతిక, సాహితీ కార్యక్రమాల్లో రాణిస్తున్న బలవీర్ చిత్రరంగంలోనూ రాణిస్తున్నందుకు పురస్కారాలపై హర్షం వ్యక్తమవుతోంది.



కొచ్చెరి మైసమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తుల కొంగు బంగారం.. కొచ్చెరి మైసమ్మ

నసురుల్లాబాద్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైలారం గ్రామ శివారులో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కాకుండా వివిధ మండలాల భక్తులు వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం కొచ్చెరి మైసమ్మ తల్లి అని అన్నారు. అనంతరం భక్తులు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయ ప్రాంగణంలో సహ పంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే షిండే

పెద్దకొడప్గల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాబల్‌గాం గ్రామానికి చెందిన చంద్రవ్వ, శివాబాయి ఇదే మండలంలోని సర్దార్ తండాకు చెందిన గోపాల్ ఇటీవల మరణించగా, వారి కుటుంబ స భ్యులను ఆదివారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పరామర్శించారు. ఈ సందర్భంగా షిండే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు మరణించడం చాలా బాధాకరమని, బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు. దీంతో పాటుగానే కష్టకాలంలో పార్టీకి ఆసరా నిలిచిన వారికి తా ము అదేవిధంగా అండగా ఉండి ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సహకార సం ఘం అధ్యక్షులు హ న్మంత్ రెడ్డి, నాయకులు తిరుమల్‌రెడ్డి, సాయాగౌడ్, సరిచంద్, గణేష్ నా యక్, రవీందర్ నాయక్, నాల్చరి రాజు, బస్వరాజ్, బాబల్‌గాం నాయకులు వీరారెడ్డి, వెంకట్‌రావ్, పండు పటేల్, విఠల్ రెడ్డి పాల్గొన్నారు.

ఐఐహెచ్‌పీ కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గం

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్‌హోమియోపతి ఫిజిషియన్స్ (ఐఐహెచ్‌పీ) అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా డాక్టర్ గోపు కృష్ణమూర్తి, ఉపాధ్యక్షులుగా సుబ్బారావు, ప్రవీణ్‌కుమార్, రాంప్రసాద్, ప్రధానకార్యదర్శిగా కులకర్ణి, సహాయ కార్యదర్శులుగా చిలుక శ్రీనివాస్, మోహన్, కోశాధికారిగా మహేష్‌కుమార్‌తో కూడిన కార్యవర్గాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమానికి హజరైన జాతీయ అధ్యక్షుడు శివమూర్తి,రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌రావులు క్యాన్సర్‌పై అవగాహన కల్పించడంతో పాటు రక్తపోటు, హర్మోన్స్ అసమతుల్యతపై వివరించారు. కామారెడ్డికి చెందిన సీనియర్ డాక్టర్ రాజేశ్వర్‌రావును లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించారు.

భాజన్ చెరువు కట్టకు పొంచి ఉన్న ప్రమాదం



బీర్కూర్‌లో భాజన్ చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని చూపుతున్న గ్రామస్థులు

బీర్కూర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బీర్కూర్ మండల కేంద్రంలోని భాజన్ చెరువు కట్ట కోతకు గురయింది. వర్షాల కారణంగా కట్టపై మట్టి కొట్టుకుపోయి ప్రమాదకరంగా మారిందని గ్రా మస్థులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆదివారం కొంతమంది గ్రామస్థులు చెరువు కట్ట వద్దకు వెళ్లి కట్టను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీవర్షాల కారణంగా భాజన్ చెరువు కట్ట కోతకు గురయిందని తెలిపారు. కట్ట ఎప్పుడు తెగుతుందో అని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి కోతకు గురైన కట్టకు మరమ్మతులు చేపట్టి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



ఎమ్మెల్యేకు జ్ఞాపిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వెంకన్న ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

దోమకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర ఆలయంలో ఆదివారం జరిగిన శ్రీ క్రిష్ణాష్టమి వేడుకల్లో కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు తీర్థప్రసాదాలు అందజేసి శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందజేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కమిటీ సభ్యులు అబ్బయ్య, స్వామి, రాజు, సిద్ధరాములు, రాజేష్, రవీందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కుంట లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

బాధిత వ్యక్తికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



బాధితుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే.

గాంధారి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గాంధారి మండలం మేడిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ శంషోద్దిన్ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురవగా హైదారాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆసుపత్రికి వెళ్లి బాధితుడిని ఆదివారం పరామర్శించారు. ఎలాంటి ఇబ్బంది పడొద్దని ధైర్యం చెప్పి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అండగా ఉంటానని కుటుంబసభ్యులకు హామీ ఇచ్చారు. శంషోద్దిన్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో మాట్లాడారు. ఆయన వెంట నాయకులు శ్రీనివాస్ నాయక్, సదాశివనగర్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వాహనదారులకు దిక్సూచి రాజ్‌మార్గ్ యాత్ర యాప్

(5వ పేజీ తరువాయి)

ఫిర్యాదు చేస్తే నేషనల్ హైవే అథారిటీ అధికారులు ఆ సమస్యను పరిష్కరిస్తారు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లను హింది, ఇంగ్లీష్ భాషల్లో అందుబాటులో ఉంచారు. రానున్న రోజుల్లో స్థానిక భాషల్లో అందుబాటులో రానున్నట్లు సమాచారం.

టోల్‌పాస్ వినియోగదారులకు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కొత్త టోల్‌పాస్ విధానంతో వాహనదారులకు సౌలభ్యం కలగనుంది. వాహనదారులు ఈ యాప్ ద్వారా తమ టోల్‌పాస్‌ను 3 వేల రూపాయలతో రిజార్జ్ చేసుకుంటే దేశంలో ఏ జాతీయ రహదారిపై అయిన, ఎక్స్‌ప్రెస్ రహదారిపై అయిన సంవత్సరం పాటు 2 వందల ట్రిప్పులను పొందవచ్చు. ఒకవేళ సంవత్సరం లోపు 2 వందల ట్రిప్పుల కన్నా ఎక్కువ అయితే తిరిగి రీచార్జ్ చేసుకోవాలి. అయితే ఈ పాస్ సౌకర్యం రాష్ట్ర రహదారులకు వర్తించదు. రాష్ట్ర రహదారుల టోల్ గేట్‌ను దాటాలంటే తిరిగి వేరే రిచార్జ్ చేసుకోవాలి. ఇక ఈ పాస్ ఎల్లో ప్లేట్ వాహనాలకు వర్తించదు. కేవలం వైట్ ప్లేట్ వాహనాలకు మాత్రమే వర్తిస్తుంది.

రహదారులపై సందేహాలు

వాహనదారుడు తాము ప్రయాణం చేసే సమయంలో ఆ రహదారి ఏది జాతీయ రహదారి, ఏది రాష్ట్ర రహదారి అని తెలియక అయోమయంకు గురి కావాల్సిన అవసరం లేదు. రాజ్‌మార్గ్ యాత్ర యాప్‌లో ఆ రహదారిని గుర్తించి అది రాష్ట్రందా, జాతీయ రహదారా అని తెలుసుకోవచ్చు.

మిత్రుడి కుటుంబానికి రూ.50వేల సాయం

గాంధారి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆపత్కాలంలో స్నేహితుల కుటుంబాలకు అండగా ఉంటూ ఆదర్శంగా నిలుస్తున్నారు గాంధారి మండలానికి చెందిన 1996-97 బ్యాచ్ పూర్వ విద్యార్థులు. మిత్రుల ఆర్థిక స్థితిగతులను నిరంతరం తెలుసుకుంటూ వారి పిల్లలకు అయ్యే ఖర్చులను భరించడం, ఆకస్మాత్తుగా ఎవరైనా మరణిస్తే వారికి తక్షణమే వారి శక్తి మేర ఆర్థిక సహాయం చేయడం లాంటి కార్యక్రమాలను చేస్తున్నారు. కాగా మండలకేంద్రానికి చెందిన అదే బ్యాచ్‌కు చెందిన పత్తి వెంకట్ పది రోజుల క్రితం మృతిచెందడంతో ఆయన కుటుంబానికి ఆదివారం మిత్రులంతా కలిసి రూ.50వేల ఆర్థికసాయాన్ని ఆదివారం అందజేశారు. ఆయన మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు మాజీ సర్పంచ్ సంజీవ్, ఆకుల బాల్‌కిషన్, నరేష్‌గౌడ్, విష్ణువర్ధన్, రాజు, శివ, తూర్పు రమేష్, నీల రవి, బాలక్రిష్ణగౌడ్, రాజేందర్, ముస్తాఫా, విష్ణు, ప్రకాస్, శివకుమార్, సంతోష్‌రెడ్డి, దేవిసింగ్, తదితరులు పాల్గొన్నారు.

‘ఆవిష్కరణలపై మక్కువ పెంచుకోవాలి’



విద్యార్థినిని అభినందిస్తూ షీల్డ్ అందిస్తున్న ఎమ్మెల్యేలు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే ఆవిష్కరణలపై మక్కువ పెంచుకోవాలని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు తెలిపారు. ఆదివారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్‌లో ఏర్పాటుచేసిన సైన్స్‌ఫెయిర్ కార్యక్రమానికి వారు హజరై వివిధ ఆవిష్కరణలు చేసి మంచి ప్రతిభ కనభరిచిన విద్యార్థులను అబినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థిదశలోనే సృజనాత్మకతను వెలికితీసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాయని, వాటన్నింటినీ విద్యార్థులు వినియోగించుకోవాలని తెలిపారు. పిల్లల్లో సైన్స్ పట్ల ఆసక్తి కలిగించడం, ప్రాచీన కాలం నుంచి నేటివరకు ఆదునిక శాస్త్రసాంకేతిక ప్రపంచ అభివృద్ధిలో భారతీయుల కృషిని పాఠశాల విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రభుత్వాలు కృషిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించి ఉపాధ్యాయులు సైతం వారికి సహాయసహాకారాలు అందిస్తే వారు ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు. చదువుతో పాటు మన సంస్కృతి సంప్రదాయాలు ముఖ్యమని తెలిపారు.పెద్దలను గౌరవించాలని సూచించారు.శిశుమందిరాలు క్రమశిక్షణతో కూడిన విద్యను బోధించడం సంతోషించదగిన విషయమని తెలిపారు. అంతకముందు విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సంచలనసమితి సహాకార దర్శి ప్రకాష్‌రెడ్డి, పాఠశాల అధ్యక్షుడు శ్యాంసుందర్, గంగారెడ్డి, కృష్ణమాచార్యులు, హరిస్మరన్‌రెడ్డి, రాజిరెడ్డి, రణజిత్‌మోహన్, భాస్కర్‌రావు, మల్లేష్‌యాదవ్, అనిల్‌రెడ్డి, నల్లనాగభూషణం, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తహసీల్ ముట్టడికి పిలుపు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్ నాయకులు రేపు ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఉన్న తహసీల్దార్ కార్యాలయం ముట్టడికి గెలుపు నిచ్చారు. పింఛన్ల పెంపు కొరకు తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కంటి పద్మారావు , మండల అధ్యక్షుడు శివాలయం పిలుపునిచ్చారు. ఆదివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి 20 నెలలు గడిచినా ఇంతవరకు పింఛన్లు పెంచలేదని, ప్రస్తుతం ఉన్న రూ. రెండువేల పింఛన్‌ను రూ. 4 వేలు చేస్తామని, వికలాంగులకు, దివ్యాంగులకు, వితంతువులకు రూ. మూడు వేల నుంచి రూ. ఆరువేలు పెంచుతామని, అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను నట్టేట ముంచారని విమర్శించారు. పింఛన్ల పెంపు కోసం ప్రతి గ్రామం నుంచి ముసలివారు, వితంతువులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో తరలి వచ్చి ముట్టడి కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎమ్మార్పీఎస్ నాయకులు మానయ్య, సాయిలు, పోచవ్వ, అశోక్, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

‘బీడీ కార్మికుల ఈపీఎఫ్ఓ పెన్షన్ పెంచాలి’

దోమకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): బీడీ కార్మికులలో ఈపీఎఫ్ఓ పెన్షన్ తీసుకుంటున్న వారికి కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పెన్షన్ ఏమాత్రం సరిపోవడం లేదని బీడీ కార్మిక సంఘం రాష్ట్ర నూతన కార్యదర్శి శివంది సత్యం అన్నారు. ఆదివారం ఆయన దోమకొండలో పెన్షన్‌దారులతో మాట్లాడారు. ఎంప్లాయిమెంట్ ప్రోవిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో కార్మికుల డబ్బులు వేలాది రూపాయలు ఉన్నాయని వాటిని కేంద్ర ప్రభుత్వం రీజినల్ ఆఫీస్ ద్వారా అందిస్తున్న పెన్షన్ సరాసరిగా రూ.వేయి, రూ.800, వస్తున్నాయన్నారు. అవి సరిపోకపోవడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. వెంటనే ఈ పీఎఫ్ఓ ద్వారా అందిస్తున్న పెన్షన్‌ను కనీసం రూ.500 పెంచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాలు చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఐరేని రాజేందర్, నర్సింలు, హాసన్, లక్ష్మణ్, సుధారాణి, సూజాత, బాలమణి పాల్గొన్నారు.



పెన్షన్‌దారులతో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

పూర్వవిద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పెద్దమల్లారెడ్డిలో కార్యక్రమం

భిక్కనూరు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): భిక్కనూరు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 1989-90లో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని పెద్దమల్లారెడ్డిలో ఏర్పాటుచేసుకున్నారు. దాదాపు 95 మంది స్నేహితులు 25 ఏళ్ల తర్వాత ఒకే వేదికపై కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేకుండా పోయింది. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని అనుభవాలు పంచుకున్నారు. గత జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ రోజంతా ఆనందంగా గడిపారు. ముందుగా కార్యక్రమాన్ని అప్పటి గురువులతో జ్యోతి ప్రజ్వలన చేయించి ప్రారంభించారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించి జ్ఞాపికలను అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా గురువులు నర్సయ్య, ప్రతాప్‌రెడ్డి, నాగభూషణంగౌడ్, విఠల్, కాశీనాథ్‌శర్మ, రాందాస్ మాట్లాడుతూ.. తాము బోధించిన పాఠాలను చక్కగా విని మంచి ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తూ మంచి స్థానంలో ఉన్న విద్యార్థులను చూస్తే ఆనందంగా ఉందన్నారు.

● భిక్కనూరులోని పద్మశాలీ ఫంక్షన్‌హాల్‌లో భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన పదవరతగతి 1988-89బ్యాచ్‌కు చెందిన 70మంది పూర్వవిద్యార్థుల సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు.



భిక్కనూరు పద్మశాలీ కళ్యాణ మండపంలో

ప్రైవేటు కళాశాలలకు తాళం

(5వ పేజీ తరువాయి)

పెట్టవద్దని ఆలోచనలు చేసి తాము మానవతా దృక్పథంతో ఉంటే ప్రభుత్వం అసలు పట్టించుకోవడం లేదని ఇలా అయితే తాము ఇక కళాశాలలు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని వాపోతున్నారు. విద్యార్థులకు అన్యాయం జరుగుతుంటే ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంటే మాత్రం పెద్ద ఎత్తున నిరసనలకు దిగుతామని ఇప్పటికే పలు విద్యార్థి సంఘాలు హెచ్చరికలు జారీ చేయడంతో పాటు నిరసనలు తెలిపాయి. ఏది ఏమైనా ప్రభుత్వం తీసుకునే నిర్ణయంపైనే విద్యార్థుల భవిష్యత్తు ఆధారపడి ఉండనుంది.

శతాధిక వృద్ధురాలు మృతి



సదాశివనగర్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సదాశివనగర్ మండలం పద్మాజీవాడి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు సామల నర్సవ్వ (103) ఆదివారం మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆమె వందేళ్లు దాటినప్పటికీ తన పని తాను చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండేదని, కొద్దిరోజుల క్రితమే అనారోగ్యానికి గురై మృతి చెందిందన్నారు. ఈ మేరకు గ్రామస్థులు నర్సవ్వ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

బాధిత కుటుంబానికి రూ.5వేల సాయం

మాచారెడ్డి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని ఎల్లంపేట వెనుకతాండాకు చెందిన అజ్మీరా లింబా కొన్ని రోజుల క్రితం ఆనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న షబ్బీర్‌అలీ షబ్బీర్‌అలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నాయకులతో రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రచార కార్యదర్శి కెలోత్ స్వామినాయక్, మండల యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ బుక్యా రాజు రాథోడ్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి షబ్బీర్‌అలీ అండగా ఉంటానని హామీ ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సంతోష్ నాయక్ , నాయకులు అజ్మీరా సంతోష్ నాయక్, బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా ప్రవీణ్ గౌడ్



రామారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్ర జ్యోతి): రామారెడ్డి మండల కాంగ్రెస్ అధ్యక్షుడిగా మొగుళ్ళ ప్రవీణ్ గౌడ్ ఆదివారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు నేతృత్వంలో తనకు అధ్యక్ష పదవీ బాధ్యతలు అప్పగించారన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మండల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు సామల శీలాసాగర్, సింగిల్ విండో వైస్ చైర్మన్ అమ్ముల పశుపతి, నాయకులు గొల్లపల్లి లక్ష్మాగౌడ్, అంబాయి ప్రసాద్, రంగు రవీందర్ గౌడ్, ప్రవీణ్, నర్సాగౌడ్, ప్రసాద్, మహిళ నేతలు, పెద్దల తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు ఎటుపోతున్నాయ్?

(5వ పేజీ తరువాయి)

అవస్థలు పడుతుంటే కొందరు ఫర్టిలైజర్ దుకాణ యజమానులు గోదాంలలో స్టాక్ ఉంచి వారి వద్ద ఇతర మందులను తీసుకుంటేనే యూరియా అందించేలా చూస్తున్నారని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా కామారెడ్డి డివిజన్ పరిధిలో ఇలాంటివి ఎక్కువగా జరుగుతున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. గోదాంలలో ఆకస్మిక తనిఖీలు చేస్తే యూరియా నిల్వలు బట్టబయలు అయ్యే అవకాశాలు లేకపోలేదని రైతులు పేర్కొంటున్నారు.

45 వేల మెట్రిక్ టన్నుల సరఫరా

జిల్లాలో కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్ల పరిధిలో సుమారు 5లక్షల ఎకరాలకు పైగా వివిధ పంటలు సాగయ్యాయి. ఈసారి వర్షాలు విస్తారంగానే కాకుండా కుండపోత వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. భారీ వరదలతో సుమారు లక్ష ఎకరాలకు పైగా పంటలు నీట మునిగాయి. అయితే ఆ స్థాయిలోనే పంటలు సాగవుతున్న నేపథ్యంలో రైతులు పంటలను చీడపీడల నుంచి కాపాడుకునేందుకు ఎరువులను వినియోగిస్తున్నారు. ఇందులో ప్రధానంగా యూరియాకు డిమాండ్ నెలకొంటుంది. తక్కువ ధర ఉండడంతో యూరియాను వాడుతుంటారు. జిల్లాలో ఈ వానాకాలంలో 49 వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం కానుండగా ఇప్పటి వరకు 45,500 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు సరఫరా చేశారు. రెండ్రోజుల వ్యవధిలోనే 1000 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించారు. మరో 450 మెట్రిక్ టన్నుల యూరియా స్టాక్ ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

నిరసనలకు దిగుతున్న రైతులు

యూరియా కోసం కర్షకులకు కష్టాలు తీరడం లేదు. గత మూడు నెలలుగా జిల్లాలో యూరియా కోసం రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ గ్రామంలో సొసైటీ వద్ద చూస్తే యూరియా కోసం రైతులు బారులు తీరిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. తెల్లవారు జామునే కాకుండా అర్ధరాత్రి నుంచే సొసైటీల ముందు, రైతువేదికల్లో రాళ్ల, చెప్పులు, పట్టా పాసు పుస్తకాలతో క్యూలైన్‌లో ఉంటూ గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఎదురువుతోంది. కుటుంబం మొత్తం యూరియా బస్తాల కోసం పనులు మానుకొని ఉంటున్నారు. రైతులు ఇంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నా కేవలం ఒక్కరికి ఒకే బస్తా మాత్రమే ఇస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. దీంతో రైతులు సహనం కోల్పోతూ సొసైటీల వద్ద నిరసన వ్యక్తం చేస్తుండగా మరికొన్నిచోట్ల రోడ్లపైకి ఎక్కి ఆందోళనకు దిగుతున్నారు. యూరియా లోడ్ వచ్చింది అంటే చాలు రైతులు ఎగబడుతుండడంతో పోలీసులు, వ్యవసాయ అధికారులు, సిబ్బంది అదుపు చేయలేకపోతున్నారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని సిరిసిల్లా రోడ్డులో రైతులు ఆందోళన చేపట్టడంతో పోలీసులు దగ్గరుండి వ్యవసాయాధికారులతో టోకెన్‌లు ఇప్పించారు. బీబీపేటలో ఇదేమాదిరి రైతులు నిరసన తెలుపడంతో ఏకంగా పోలీసుస్టేషన్‌లో టోకెన్‌లు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది.



పెద్దకొడప్‌గల్‌లో సొసైటీ ఎదుట క్యూలైన్‌లో నిరీక్షిస్తున్న రైతులు(ఫైల్)

నానో యూరియాపై అవగాహన కల్పించడంలో విఫలం

యూరియాకు బదులు ప్రభుత్వం నానో యూరియాను ప్రమోట్ చేస్తోంది. పంట పొలాలపై యూరియా ఏ విధంగా పని చేస్తుందో అంత కుమించే నానో యూరియా ఫలితాలు ఉంటాయని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. యూరియా పూర్తిస్థాయిలో సరఫరా కాకపోవడంతో నానో యూరియా ద్రవాన్ని మార్కెట్‌లో అందుబాటులో ఉంచుతోంది. కానీ నానో యూరియాపై వ్యవసాయశాఖ అధికారులు, రైతులకు అవగాహన కల్పించడంలో విఫలమవుతున్నట్లు తెలుస్తోంది. నానో యూరియా ద్రవ రూపంలో ఉంటుందని 500 ఎంఎల్‌ను ఎకరం పొలానికి వినియోగించవచ్చని అధికారులు చెబుతున్నారు. పంటలపై 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు నానో యూరియాను పిచికారీ చేస్తే దిగుబడులు పెరుగుతాయి. యూరియా వేసే ప్రతీ పంటకు నానో యూరియా వినియోగించుకోవచ్చు.



గుడుంబా లేని ఎక్సైజ్ స్టేషన్‌గా దోమకొండ

దీపిక ఎక్సైజ్ ఎస్సై, దోమకొండ

ప్రశ్న: మీ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

జ: దోమకొండ ఎక్సైజ్ సీఐ కార్యాలయం పరిధిలో 5 మండలాలు ఉన్నాయి. సీఐతో పాటు దోమకొండలో నేను ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నాను. ప్రస్తుతం నా పరిధిలో భిక్కనూర్, దోమకొండ, బీబీపేట, తాడ్వాయి, రాజంపేట 5 మండలాలు ఉన్నాయి.

ప్రశ్న: బీబీపేట మండలంలోని రెండు గ్రామాల్లో కల్లు ముస్తేదారులు నిబంధనలు పాటించకుండా దుకాణాలను ఏర్పాటుచేసి కల్లు విక్రయిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మీరేమంటారు?

జ: మండల పరిధిలో ఉన్న కల్లు దుకాణాదారులు నిబంధనల ప్రకారమే విక్రయిస్తున్నారు. ప్రతి రోజు ఒక్కో మండలంలో తనిఖీలు చేస్తున్నాం. కానిస్టేబుళ్లు గ్రామాల్లో పర్యటిస్తూ తనిఖీ చేస్తున్నారు.

ప్రశ్న: ఎక్కడైనా గుడుంబా తయారీ, గంజాయి మొక్కల పెంపకం జరుగుతుందా. వాటిని మీ పరిధిలో పట్టుకున్నారా. కేసులు నమోదు చేశారా?

జ: గంజాయి మొక్కల పెంపకం ఎక్కడ కూడా లేదు. గుడుంబా తయారీ కూడా లేదు. రాష్ట్ర స్థాయిలో గంజాయి, గుడుంబా లేని ఎక్సైజ్ స్టేషన్‌గా దోమకొండ ఉంది.

ప్రశ్న: దోమకొండ, భిక్కనూర్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారని. ఉదయం నుంచే బెల్ట్ షాపుల్లో ప్రజలు మద్యం సేవిస్తూ గొడవలు పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. మీ దృష్టికి వచ్చాయా?

జ: బెల్ట్‌షాపుల నిర్వహణ పట్ల కఠినంగా ఉన్నాం. అన్ని గ్రామాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. అలాంటివి ఎక్కడ కూడా జరుగలేదు. గ్రామాల్లో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైన మద్యం అమ్మినట్లు తమ దృష్టికి తీసుకువస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచి, నిర్వహించే వారిపై చర్యలు తీసుకుంటాం.

●ఆంధ్రజ్యోతి, దోమకొండ

జీపీవోలు వచ్చారు.. వార్డు ఆఫీసర్లు వెళ్లారు

ఎల్లారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి మండలానికి 24 మంది గ్రామ పాలన అధికారులు కొత్తగా రాగా, మున్సిపల్ కార్యాలయం నుండి ఆరుగురు జూనియర్ అసిస్టెంట్ కమ్ వార్డు ఆఫీసర్లు వెళ్లిపోయిన పరిస్థితి. 2020 సెప్టెంబర్‌లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వీఆర్‌వో వ్యవస్థను రద్దు చేసింది. మొదట వీఆర్‌వోలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేశారు. ఆ తర్వాత 2023 ఆగస్టులో వీఆర్ఏలకు అర్హతను బట్టి జూనియర్ అసిస్టెంట్ లేదా రికార్డు అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పించి వివిధ శాఖలకు పంపారు. వీఆర్‌వో, వీఆర్ఏ వ్యవస్థ రద్దుతో గ్రామాల్లో భూ రికార్డుల పరంగా అనేక చిక్కు సమస్యలు ఏర్పడ్డాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామ పాలన అధికారులను నియమించాలని నిర్ణయించింది. వివిధ శాఖలో వెళ్లిన మాజీ వీఆర్‌వోలకు పరీక్ష నిర్వహించి అందులో తీర్ణులైన వారిని గ్రామ పాలన అధికారులుగా నియమించారు. వారికి ఈనెల 5న సీఎం నియామక పత్రాలు అందజేశారు. 6న మండలాల గ్రామాలు కేటాయించి కలెక్టర్ పోస్టింగులు ఇచ్చారు. ఎల్లారెడ్డి మండలంలో 24 క్లస్టర్ల ఉండగా 24 మంది గ్రామపాలన అధికారులకు పోస్టింగ్ ఇచ్చారు. ఇది ఇలా ఉండగా వీఆర్ఏలను పదోన్నతిపై వివిధ శాఖల్లో సర్దుబాటు చేసినప్పుడు ఎల్లారెడ్డి మున్సిపల్ కార్యాలయానికి ఎల్లారెడ్డి మున్సిపాలిటీకి 9 మంది జూనియర్ అసిస్టెంట్లు కమ్ వార్డు ఆఫీసర్లుగా వచ్చారు. ఇప్పుడు ఆరుగురు గ్రామ పాలన అధికారులుగా వెళ్లి పోయారు. ఎల్లారెడ్డి మండలంలో 24 క్లస్టర్లు ఉండగా 24 మందికి పోస్టింగ్ ఇవ్వగా కొంతమంది విధుల్లో చేరారు. తమ కార్యాలయం నుంచి ఆరుగురు వార్డు ఆఫీసర్లు గ్రామ పాలన అధికారులుగా నియామకమయ్యారని, ప్రభుత్వ ఉత్తర్వులు అందాయని దీంతో వారు రిలీవ్ కూడా అయినట్లు మున్సిపల్ కమిషనర్ మహేష్ కుమార్ తెలిపారు. గ్రామ పాలన అధికారుల నియామకంతో గతంలో వివిధ శాఖల్లో భర్తీ అయిన మాజీ వీఆర్ఏల నుంచి సుమారు 70 శాతం తిరిగి వెళ్లి పోతుండడంతో ఆయా శాఖలు మళ్లీ సిబ్బంది కొరత ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది అంటున్నారు.

‘యూరియాను సక్రమంగా వినియోగించుకోవాలి ’



పోలీసు బందోబస్తు మధ్య రైతులకు యూరియా సంచుల పంపిణీ

రామారెడ్డి, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): పంటలకు అనుగుణంగా యూరియా సంచులను సక్రమంగా వినియోగించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్ రెడ్డి పేర్కొన్నారు. రామారెడ్డి మండలం అన్నారం, రెడ్డిపేట్ గ్రామాల్లో యూరియా పంపిణీ కేంద్రాలను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ తత్వంతో ఉండరాదని రైతులు క్రమ పద్ధతిలో పద్ధతులు పాటించి యూరియా సంచులను తీసుకోవాలని పలు సలహాలు, సూచనలు, పద్ధతులను అందజేశారు. యూరియా కోసం పెద్ద క్యూలైన్ కట్టిన రైతులు ఆందోళనకు పాల్పడటం చాలా విడ్డూరమని పేర్కొన్నారు.

● **యూరియా కోసం పడరాని పాట్లు**

మరోవైపు రైతులకు సరిపడేలా యూరియా అమ్మకపోవడంతో రామారెడ్డి రైతులు తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూ లైన్‌లో బారులు తీరారు. అయినప్పటికీ సరిపడా అందుబాటులో లేకపోవడంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఎస్సై లావణ్య నేతృత్వంలో అక్కడికి చేరుకొని బందోబస్తు నిర్వహించారు. రెడ్డిపేట్ రైతులకు 440 యూరియా బస్తాలు పంపిణీ చేశామని మండల వ్యవసాయ అధికారి భాన్శశ్రీ పేర్కొన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ స్వామి గౌడ్, మండల కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ అధ్యక్షుడు మద్దికుంట నర్సాగౌడ్, నాయకులు సల్మాన్, నర్సారెడ్డి పాల్గొన్నారు.

నానో యూరియాను వాడండి

మోపాల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): రైతులు నానో యూరియా వాడటం వల్ల అధిక దిగుబడులు పొందే అవకాశం ఉంటుందని డీఏవో గోవింద్ సూచించారు. ఆదివారం మండలంలోని ఉన్న ఎరువుల గోదాంలను పరిశీలించారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- గాటి
ప్రియ 35- మదరాసి
దర్శన్- బాగి - 4

బాన్సువాడ

మహేశ్వరి ఘాటీ
వెంకటేశ్వర మదరాసి

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.160	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230